# సరూర్‌నగర్ పీహెచ్‌సీలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

❖ వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యతపై పరిశీలన



**దశ, రంగారెడ్డి:** సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణకుమారితో కలిసి ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు, రోగుల హాజరు, ఓపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందేలా సిబ్బంది సమయపాలన పాటించాలని, అందుబాటులో ఉన్న అన్ని సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, మందుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డాక్టర్ కిరణ్మయి సూచించారు.

# అనుమతి లేని ఫ్లెక్సీలపై ఉక్కుపాదం

❖ ముద్రించినా.. ఏర్పాటు చేసినా చర్యలు తప్పవు: నల్గొండ మున్సిపల్ కమిషనర్




**దశ, నల్గొండ:** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఫ్లెక్సీల ముద్రణ, ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ హెచ్చరించారు. ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపుల యజమానులతో కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి పత్రాన్ని పరిశీలించిన తర్వాతే ఫ్లెక్సీలను ముద్రించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, వ్యక్తులు లేదా సంస్థల నుంచి ఆర్డర్లు వచ్చినా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

అనుమతి పొందిన హోర్డింగ్స్, మీడియన్‌లో అనుమతితో ఏర్పాటు చేసిన లాలీపాప్ బోర్డులకు మాత్రమే ఫ్లెక్సీలు ముద్రించాలని తెలిపారు. జంక్షన్లు, మీడియన్ పోల్స్ తదితర ప్రాంతాల్లో అనుమతి లేని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదన్నారు. కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న రౌండ్ ఫ్లెక్సీలతో వాహనదారులకు దృశ్యమానత తగ్గి ప్రమాదాలకు అవకాశం ఉన్నందున రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అనుమతి లేని ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన వారితో పాటు దానిని ముద్రించిన ప్రింటింగ్ షాపు యజమానిపైనా చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. నగర సౌందర్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి, నల్గొండ నగరంలోని ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు

**దశ, పెద్ద అంబర్ పేట :** పెద్ద అంబర్‌పేట్, ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లోని తక్షశిల హైస్కూల్, పెద్ద అంబర్‌పేట్‌లోని లిటిల్ స్టార్ ప్లే స్కూల్‌లో చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ముస్తాబైన చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేణుగానం, నృత్యాలు, భక్తిగీతాలతో సందడి చేశారు. పలు పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. వేడుకలతో పాఠశాల ప్రాంగణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. చిన్నారుల ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.





# పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




**దశ, పెద్ద అంబర్ పేట :** పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న విద్యార్థులు నృత్యాలు, భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. చివరగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల నిర్వహణ ప్రతినిధి బెరెల్లి కమలాకర్‌రావు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.బి.వి. సుబ్రహ్మణ్యం భగవద్గీతలోని విలువలను ఆచరిస్తూ క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. ప్రశాంత్‌కుమార్ గీతా బోధనల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త ధనుంజయరావు కొడాలి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి ఎ. సంతోష్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**దశ, రామన్నపేట:** మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్లు కొట్టడం, ఆనంద తాండవం వంటి నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఉట్ల ఉత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా మార్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణితో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, మురళి, రషీద్, అలీం, ఉమారాణి, వినోద, పూనం, లావణ్య, ఆసియా, ఫారియా తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న ఉద్యోగుల హైదరాబాద్ చలో

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీగా తరలిరావాలి..
- ప్రభుత్వ హామీల అమలుకు ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

**దశ, రంగారెడ్డి :** ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం సెప్టెంబర్ 10న నిర్వహించనున్న హైదరాబాద్ చలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రంగారెడ్డి జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఊటు యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు నిర్వహిస్తున్న హైదరాబాద్ చలో కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగో తరగతి ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు ఐక్యంగా ముందుకు వచ్చి తమ నిరసనను బలంగా వినిపించాలని కోరారు. సెప్టెంబర్ 10న జరిగే హైదరాబాద్ చలో కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప కార్యదర్శి ఎం. శ్రీను, ఉపాధ్యక్షులు గోపాల్, రమేష్, డేవిడ్, గోపాల్‌జీ, శాంతిశ్రీ, ఉపాధ్యక్షులు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, జమ కుశాల్, మల్లారెడ్డి, రంగయ్య, గోపాల్, వెంకటస్వామి, పరమేష్, మహేష్, సంతోష్, ప్రమీల, రాణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలి



**దశ ఓయూ:** దివ్యాంగుల సంక్షేమం, హక్కుల అమలుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించి పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం కోరారు. ఈ మేరకు మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల విద్య, ఉపాధి, సంక్షేమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగ నిరుద్యోగ యువత కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లోని బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలను గుర్తించి ప్రత్యేక నియామకాలు చేపట్టేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 (ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్)ను రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. డీఎస్సీతో పాటు ఇతర నియామక ప్రక్రియల్లోనూ నిబంధనల ప్రకారం 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్య, ఉపాధి, శిక్షణ, సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మోదాల సైదులు యాదవ్, రాగం శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి సభ్యులు కొమరమల్లు యాదవ్, వాంకుడోత్ లాల్‌సింగ్, కరుణాకర్, వేణుగౌడ్, గోపాల్‌తో పాటు దివ్యాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాచారంలో ఘనంగా కోటి పార్థివలింగార్చన మహోత్సవం

❖ *భక్తిశ్రద్ధలతో 108 పార్థివలింగాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు*



**దశ, ఓయూ:** శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో నాచారంలోని పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో కోటి పార్థివలింగార్చన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉమారాణి, లలితా సహస్రనామ పారాయణ భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా దీపారాధన, కలశస్థాపన, గణపతి, గౌరీ పూజ, నవగ్రహ ఆరాధన నిర్వహించారు. అనంతరం భక్తులు పుట్టమన్నుతో 108 పార్థివలింగాలను తయారు చేసి పంచామృత, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భస్మార్చన, పుష్పార్చన, బిల్వార్చనతో పాటు ధూప, దీప, నైవేద్యాలతో శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్ఛారణలు, భజనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా బాసర శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు, శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతూ బాసర క్షేత్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయ ఈశాన్య భాగంలో కోటి పార్థివలింగ స్థూపాన్ని నిర్మించామని తెలిపారు. భక్తులు పార్థివలింగాలను తయారు చేసి పూజలు నిర్వహించిన అనంతరం వాటిని స్థూపంలో నిక్షిప్తం చేసే అవకాశం ఉందన్నారు.

ఆసక్తి ఉన్న మహిళా బృందాలు 9948332032 నంబరులో సంప్రదిస్తే పుట్టమన్నును ఉచితంగా అందజేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించేలా సహకరిస్తామని చెప్పారు. భజన మండలి కార్యనిర్వాహకురాలు ఉమారాణి మాట్లాడుతూ పార్థివలింగార్చన చేయడం, చేయించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ నెల 20న బాసర క్షేత్రంలో జరిగే మాసోత్సవంలో ప్రత్యేక పూజలు, హోమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు శర్మ, భజన మండలి సభ్యులు, నిర్వాహకులు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



❖ *శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి*



**దశ, రంగారెడ్డి:** వినాయక చవితి ఉత్సవాలను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో గణేష్ చవితి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న ఉత్సవాలు ప్రారంభమై 24న నిమజ్జనం జరగనున్నందున మండపాల నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

మండపాల ఏర్పాటు ప్రదేశాలను ముందుగానే పరిశీలించి, అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లను తనిఖీ చేసి ప్రమాదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. మండపాల వద్ద పారిశుద్ధ్యం, ఫాగింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు, ఇతర ప్రమాదకర అంశాలను తొలగించాలని, విగ్రహాల తరలింపు వాహనాలను ముందుగానే తనిఖీ చేయాలని తెలిపారు. చెరువుల వద్ద తగినన్ని క్రేన్లు, బారికేడ్లు, వైద్య బృందాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థ ఏర్పాటు చేసి సమస్యలు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ నిమజ్జన ప్రాంతాల్లో తగినన్ని క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విదేశాల్లో భారతీయ న్యాయవాదులకు విస్తృత అవకాశాలు

❖ *న్యాయవాది పూజారి నాగేశ్వరరావు*

**దశ, రంగారెడ్డి :** భారతీయ న్యాయవాదులు తమ పరిజ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటే విదేశాల్లో న్యాయవృత్తిలో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ప్రముఖ న్యాయవాది పూజారి నాగేశ్వరరావు అన్నారు. రంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "భారతీయ న్యాయవాదులకు యూకే, యూఎస్, దుబాయ్‌లలో న్యాయవృత్తి అవకాశాలు-ప్రాక్టీస్ విధానం" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వరరావు న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆయా దేశాల్లో న్యాయవృత్తికి ప్రత్యేక అర్హతలు, లైసెన్సింగ్ విధానాలు, బార్ పరీక్షలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు ఉంటాయని వివరించారు.

యూకే, యూఎస్, దుబాయ్‌లలో కార్పొరేట్, కమర్షియల్, ఇంటర్నేషనల్ లా, ఆర్బిట్రేషన్, ఇమ్మిగ్రేషన్, లీగల్ కన్సల్టెన్సీ, కంప్లయెన్స్, లీగల్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ తదితర రంగాల్లో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారతదేశంలో కోర్టు ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు తమ అనుభవాన్ని అంతర్జాతీయ న్యాయరంగంతో అనుసంధానం చేసుకునే మార్గాలను వివరించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో న్యాయవాదులు అంతర్జాతీయ న్యాయ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, భాషా ప్రావీణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులు విదేశాల్లో న్యాయవృత్తికి సంబంధించిన అవకాశాలపై ముందుగానే అవగాహన పెంచుకుని, తమ కెరీర్‌కు సరైన దిశను ఎంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విప్లవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వోద్యారపు రవికుమార్, సహాయ కార్యదర్శి మల్లేశం, కోశాధికారి మాధవి, లైబ్రరీ కార్యదర్శి ప్రసాద్, సీనియర్, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజల పట్టా భూములను 22Aలో చేర్చి హక్కులు హరిస్తారా?: మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**దశ, ఓయూ:** ప్రజల కష్టార్జితంతో కొనుగోలు చేసిన పట్టా భూములు, ప్రైవేట్ ప్లాట్లను 22A (రిజిస్ట్రేషన్ నిషేధిత) జాబితాలో చేర్చడంపై బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా పీర్జాదిగూడలోని మేడిపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భూములను 22A జాబితాలో చేర్చి వారి ఆస్తి హక్కులను హరించే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసిన రైతులు, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు, భూ లావాదేవీలు, బ్యాంకు రుణాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల అభ్యంతరాలను, భూ యజమానుల పత్రాలను పరిశీలించకుండా అర్హతలేని భూములను 22A జాబితాలో చేర్చడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల భూములను కాపాడాల్సిన ప్రభుత్వం, వాటినే వివాదాస్పదంగా మార్చడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల ఆస్తులపై కూడా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. 22A జాబితా పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, వారి హక్కులను నిలిపివేయడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

అర్హతలేని భూములను తక్షణమే 22A జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించాలి. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం అని జక్క వెంకట్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల భూములు, ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి, రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, రమేష్, సతీష్ రెడ్డి, మురళి, రాజేష్ రెడ్డి, నరసింహ రెడ్డి, కోటగిరి శ్రీకాంత్, జగన్ రెడ్డి, శశిధర్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, అశోక్, సతీష్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, అక్షిత్, వెంకట్, అమర్ పటేల్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.3.54 కోట్ల ఆస్తులు.. టౌన్ ప్లానింగ్ అధికారి సోమయ్యపై ఏసీబీ కేసు

❖ *సూర్యాపేట, హైదరాబాద్ సహా 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు.*

❖ *ఇళ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములు, బంగారం, నగదు స్వాధీనం.*

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి వి. సోమయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు గురువారం సోమయ్య నివాసం, కార్యాలయంతో పాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు అధికారికంగా వివరాలు వెల్లడించారు. సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు గుర్తించారు.

### 3 ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి

ఏసీబీ గుర్తించిన ఆస్తుల్లో సూర్యాపేట జిల్లాలో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో ఐదు నివాస ఆస్తులు గుర్తించారు. వీటిలో జీ+1, జీ+2, జీ+4 భవనాలతో పాటు ఒక పెంట్‌హౌస్, రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సూర్యాపేట పరిధిలో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు.

### 709 గ్రాముల బంగారం.. 1,750 గ్రాముల వెండి

సోదాల్లో రూ.4,63,990 నగదు, బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.13 లక్షల నిల్వలు గుర్తించారు. అదేవిధంగా 709 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,750 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. వీటి విలువ సుమారు రూ.20 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. సోమయ్యకు చెందిన రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా పేర్కొన్నారు. ఇంట్లోని గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ సుమారు రూ.11 లక్షలుగా అంచనా వేశారు.



### బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల రుణం

బంగారాన్ని తాకట్టు పెట్టి బ్యాంకు ద్వారా సుమారు రూ.49 లక్షల రుణం పొందినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

### రూ.3.54 కోట్లుగా ఆస్తుల ప్రాథమిక అంచనా

ఇప్పటివరకు గుర్తించిన ఆస్తులు, నగదు, బంగారం, వాహనాలు తదితరాలను కలిపి సోమయ్యకు సంబంధించిన ఆస్తుల మొత్తం విలువను రూ.3,54,36,490గా ఏసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆదాయ వనరులతో పోలిస్తే ఈ ఆస్తుల విలువపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టు ఎదుట హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## వెయ్యి రోజులు ప్రజాపాలన అందించిన ఘనత కాంగ్రెస్‌ది

❖ *మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటయ్య*

**దశ, మునగాల:** రాష్ట్ర ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనతో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలనకు వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా, టిపిసిసి పిలుపు మేరకు గురువారంమండల కేంద్రంలో వెయ్యి రోజుల ప్రజాపాలన ప్రత్యేక సంబరాల కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలుస్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రధాన వీధిలో గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల కోటయ్య ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలిశెట్టిబుచ్చి పాపయ్య, నల్లపాటి శ్రీనివాస్, ఓరుగంటి రవి, కాలే సామెల్, కాసర్ల బోస్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

